క్లుప్తంగా

రిక్రియేషన్ క్లబ్ ప్రారంభం



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ జాన్‌పాకలో ఏ స్టార్ రిక్రియేషన్ క్లబ్‌ను వరంగల్ ఎంపీ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. క్లబ్ నిర్వాహకులు ఖురేషి, కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు దుపాకి సంతోష్, నాయకులు గోదాసి చిన్న, జానీ, మాజీ ఉపసర్పంచ్ మసూద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మొరం వితరణ



పర్వతగిరి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కల్లెడ గ్రామానికి చెందిన ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు శనివారం లక్ష రూపాయల విలువైన మొరం అందజేశారు. స్కూల్ హెచ్‌ఎం పాక రమేశ్‌బాబు విజ్ఞప్తి మేరకు తహసీల్దార్ అనుమతి తీసుకుని డంపర్ల సహాయంతో స్కూల్ ఆవరణలోని మైదానంలో మొరం పోయించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావును ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేట పట్టణ శివారులో శనివారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలంలోని ఇల్లందకు చెందిన పోలెపల్లి రాజు, స్రవంతి ద్విచక్ర వాహనంపై జఫర్‌గఢ్ దిశగా ప్రయాణిస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజుకు, స్రవంతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరినీ వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

అనాథాశ్రమానికి సాయం



చెన్నారావుపేట : మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన ఇందూరి రాజు అతడి చిన్న కుమారుడు రిత్విక్ జ్ఞాపకార్థం మాతృతి భూమి చారిటబుల్ ట్రస్టు (సంజీవని ఆశ్రమం)కు శనివారం రూ.10 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. తన కుమారుడు రిత్విక్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా అనాథాశ్రమానికి సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తప్పెట రమేశ్, నాయకులు అమ్మిరెడ్డి కరుణాకర్, రాగిరి కమలాకర్, తప్పెట కోటేశ్వర్ రాజ్, కడిదెల రాజ్‌కుమార్, తప్పెట అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..



చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన కుసుమ జ్యోతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి పద్మశాలి మహిళ పొదుపు సంఘం ఆధ్వర్యంలో బాధ్యులు శనివారం రూ.8 వేల సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు పర్ష స్వప్న, సభ్యులు కందకట్ల అరుణ, చంద్రకళ, కుసుమ ఆమని, గోరంట్ల రజిత, ములుక ఉమ, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే గెలుపు ఖాయం

ఐనవోలు : ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే గెలుపు ఖాయమని విద్యావారధి జిల్లా అధ్యక్షుడు బీమళ్ల సారయ్య, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్‌పీ) దూసరి భవన్ కుమార్ స్పష్టం చేశారు. మండలంలో ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ ఆవాస ప్రాంత సర్వే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సింగారం, ఐనవోలు గ్రామాల్లో ఫిజికల్లీ డిసేబుల్డ్ విద్యార్థులను గుర్తించి వారిని సమీపంలోని ఒంటిమామిడిపల్లి, ఐనవోలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. అనంతరం సారయ్య, భువన్ కుమార్ మాట్లాడారు. అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు బోధించేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించిందని చెప్పారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను ఇంట్లో ఉంచకుండా పాఠశాలకు పంపి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆకాంక్షించారు.

వయోవృద్ధులకు అండగా ఉంటాం

నర్సంపేట : వయోవృద్ధులకు అండగా ఉంటామని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ పని చేస్తుందని అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం మనోహర్‌రెడ్డి మాట్లాడారు. సమాజంలో మానవ, నైతిక విలువలు అంతరించిపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. వయోవృద్ధులను శారీరక, మానసిక, ఆర్థిక వేధింపులకు గురి చేస్తున్న దుస్థితి కనపడుతోందని తెలిపారు. సమాజంలోని కొందరు వయోవృద్ధులను నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. వయోవృద్ధులు హక్కుల ఉల్లంఘనకు గురైతే హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 14267కు ఫోన్ చేయాలని సూచించారు. వయోవృద్ధులకు సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సంఘం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్‌బాబు, వీరస్వామి, వి.సాంబయ్య, భూపాల్‌రెడ్డి, మల్లయ్య, ఈశ్వరమూర్తి, లింగయ్య, సత్యం, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

చెన్నారావుపేట : మండల కేంద్రంలో వయోవృద్ధులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగ సత్యనారాయణ, వరంగంటి కుమారస్వామి మాట్లాడారు. వయోవృద్ధులను సమాజంలోని ప్రతీఒక్కరు గౌరవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, కంది నారాయణరెడ్డి, గట్ల కృష్ణయ్య, కాసుల నర్సింహచారి, పత్తి సంజీవరెడ్డి, తాళ్లపెల్లి కొమ్మాలు, పరకాల కొంరయ్య, శ్రీరామోజు ఉపేంద్రచారి, కోరె కట్టయ్య, నర్సయ్య, నర్సింహరాములు, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట : ర్యాలీ తీస్తున్న వృద్ధులు

గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



బోరు బావి పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

సంగెం : గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీపీ కళావతి తెలిపారు. మండలంలోని రామచంద్రాపురంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మంజూరు చేసిన రూ.4 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన బోరు బావి నిర్మాణ పనులను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటికి కొరత నివారించేలా అవసరమైన పలు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిదురాల రజిత రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవ రెడ్డి, పరకాల అధికార ప్రతినిధి జనగాం రమేశ్, నాయకులు అంజన్‌రావు, దిలీప్‌రావు, ఈక బుచ్చయ్య, బాబు, రాజేశ్వర్‌రావు, రాజయ్య, బుచ్చయ్య, కిరణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో తాగునీటి ఎద్దడి నివారించాలి

సంగెం : పల్లెల్లో తాగునీటి ఎద్దడి నివారించాలని ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి మహ్మద్ ఇస్మాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కాసర్ల రవీందర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో వీధి దీపాలు వెలగడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మోడల్ స్కూల్‌లో వంట గది లేక నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, తరగతి గదులు సరిపడా నిర్మించాల్సి ఉందన్నారు. అన్ని గ్రామాల్లోనూ లైబ్రరీని ఏర్పాటు చేయాలని, ఇతర సమస్యలన్నిటినీ పరిష్కరించేలా అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోనె రాంచందర్, జక్క అశోక్, దూడయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఇస్మాయిల్, నాయకులు

రాధక్క మృతి విప్లవోద్యమానికి లోటు



జోహార్లు అర్పిస్తున్న నాయకులు

నల్లబెల్లి : గోదావరిలోయ ప్రతిఘటన ఉద్యమ నిర్మాత చంద్ర పుల్లారెడ్డి జీవిత సహచరి, భారత విప్లవ ఉద్యమ నాయకురాలు రాధక్క అలియాస్ నిర్మలక్క (86) మృతి విప్లవోద్యమానికి తీరని లోటని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అన్నారు. మండలంలోని మూడుచెక్కలపల్లిలో రాధక్క చిత్రపటానికి రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాల వేసి జోహార్లు అర్పించారు. అనంతరం రాజేందర్ మాట్లాడారు. గోదావరిలోయ ప్రతిఘటన విప్లవోద్యమంలో రాధక్క అందించిన సేవలను కొనియాడారు. రాధక్క ఆశయాలను కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి జక్కుల తిరుపతి, పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్ర అజయ్, రవి, నాయకులు పరికి రత్నం, రమేశ్, రవి, కోటన్న, తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సామాజిక సేవలు

గీసుకొండ : వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సూచన మేరకు 'డాన్ టూ డస్క్' కార్యక్రమంలో భాగంగా వరంగల్‌లోని కాశిబుగ్గ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు కీర్తినగర్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయానికి మైక్ సెట్, ధర్మారంలో వీధి వ్యాపారులకు గొడుగులు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్కులు, వీధి వ్యాపారికి నాలుగు చక్రాల తోపుడు బండి అందజేశారు. పలువురి నుంచి నేత్ర,, అవయవదాన అంగీకార పత్రాలు సేకరించారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మడిపెల్లి భాస్కరం, సభ్యులు తోట వైద్యనాథ్, రాజేశ్‌కుమార్, కరుణాకర్, క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పి.సంపత్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ పి.రమేశ్, కార్యదర్శి వీరబద్రయ్య, కోశాధికారి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



వీధి వ్యాపారికి గొడుగు అందిస్తున్న ప్రతినిధులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన

తొర్రూరు రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. మండలంలోని హరిపిరాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జయశంకర్ బడిబాట కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారం అందజేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందని తెలిపారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో త్వరలోనే విద్యా కమిషన్ ఏర్పాటు కానుందని చెప్పారు. అంతకుముందు తొర్రూరు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, ఎంఎన్‌ఓ మహంకాళి బుచ్చయ్య, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు : మండల కేంద్రంలో కల్లు పారుతున్న తాటిచెట్లను జేసీబీతో తొలగించిన ఆగంతకులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని గీతకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తాటిచెట్లను తొలగించిన భూస్వామి లక్ష్మారెడ్డి, కౌలుదారు తోట సదయ్యపై చర్య తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ క్రాంతికుమార్‌కు, ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. 30 తాటిచెట్లను నిర్దాక్షిణ్యంగా తొలగించారని చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గౌడసొసైటీల ద్వారా 5 ఎకరాల స్థలంలో తాటి, ఈత, గిరిక తాళ్లను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గీత కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జనగాం భిక్షపతిగౌడ్, గౌడసంఘం అధ్యక్షుడు విలాసాగరపు స్వామి, కార్యదర్శి ఏరుకొండ పైడి, గుర్రం ప్రభాకర్, బయగాని రమేశ్, ఏరుకొండ భగవాన్, గుర్రం రంజిత్‌గౌడ్, పొగాకుల సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

19న సదరం క్యాంపు

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రిలో ఈనెల 19న సదరం క్యాంపు నిర్వహిస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ మనోజ్‌లాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలతోపాటు మూడు మున్సిపాలిటీల పరిధిలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శారీరక (ఆర్థో) విభాగం, మూగ, చెవిటి వైకల్యానికి సంబంధించిన దివ్యాంగులు ఈనెల 19న సదరం స్లాట్ మీ సేవ బుక్ చేసుకుని ఆస్పత్రిలో ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకున్న దరఖాస్తుతోపాటు రిపోర్టులు, ఎక్స్‌రే, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తెచ్చుకోవాలని కోరారు.

ఎగ్ పఫ్‌లో ప్లాస్టిక్.. తహసీల్దార్‌కు ఫిర్యాదు



వినతిపత్రం ఇస్తున్న శివాజీ

రాయపర్తి : ఎగ్ పఫ్‌లో ప్లాస్టిక్ వచ్చిందంటూ మండలంలోని బందనపల్లికి చెందిన కొడగాని శివాజీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శివాజీ వివరాలు వెల్లడించారు. మండల కేంద్రంలోని జ్యోతి బెంగళూర్ బేకరిలో కుటుంబ సభ్యులతో కలిసి ఎగ్ పఫ్ తీసుకోగా అందులో ప్లాస్టిక్ వచ్చిందని చెప్పారు. ఈ విషయాన్ని బేకరీ యజమానికి తెలిపినా పట్టించుకోలేదని ఆందోళన వెలిబుచ్చారు. విచారణ చేపట్టి బేకరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

కాంగ్రెస్ నాయకుడి ఔదార్యం



గీసుకొండ : మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బొల్లం శివ తల్లిదండ్రులు లేని అనాథ బాలలైన సాయి అద్విత్, శ్రీశాన్విలకు వరంగల్‌లోని కాశిబుగ్గకు చెందిన నేషనల్ హైస్కూల్‌లో ఉచితంగా అడ్మిషన్ ఇప్పించడంతోపాటు పుస్తకాలు, యూనిఫారం కోసం శనివారం రూ.10 వేల సాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. ఈ సందర్భంగా శివ మాట్లాడారు. మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు బాలలకు తోడ్పాటు అందించినట్లు తెలిపారు. శివను నాయకులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిలువేరు శ్రీను, ఇనుగాల బాబు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో మాససంక్రమణ పూజలు



ఐనవోలు : ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం మాససంక్రమణ పూజలు చేశారు. ఉదయం నిత్యపూజల అనంతరం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. గొల్లకేతమ్మ, బలిజమేడలమ్మతో మల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహించారు. ఒగ్గు పూజారులు పెద్దపట్నం వేసి పూజ చేశారు. కార్యక్రమంలో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు మధుకర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

'మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తలే..'

ఐనవోలు : ప్రైవేటు కంపెనీకి చెందిన మక్కజొన్న విత్తనాలు సరిగా మొలకెత్తక పోవడంతో తాను నష్టపోయినట్లు మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన రైతు సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియో శనివారం వైరల్ అయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన రైతు బండారి శ్రీను వెంకటాపురం గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద ఒకటిన్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. ఈ క్రమంలో పదిరోజుల క్రితం ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన 3 బస్తాల మొక్కజొన్న విత్తనాలు ఖరీదు చేసి చెలుకలో విత్తుకున్నాడు. పదిరోజులు గడిచినా విత్తనాలు సరిగా మొలకెత్తకపోవడంతో సంబంధిత డీలర్‌ను సంప్రదించాడు. అతను పట్టించుకోలేదని, 20 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాని, ఎన్నడూ విత్తనం మొలకెత్తకుండా లేదని వాపోయారు. భూమి కౌలుకు తీసుకుని సాగు చేస్తే రూ.20 వేల నష్టం వాటిల్లిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతూ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు.

అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు కీలకం



ఎమ్మెల్యే మాధవరెడ్డితో టీడీఎఫ్ సభ్యులు

● కెనడాలో ఎమ్మెల్యే మాధవరెడ్డికి సన్మానం

నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర, నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధిలో ఎన్ఆర్ఐల సహకారం కీలకమని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. అమెరికా తెలుగు సంఘం (ఆటా) ఆధ్వర్యంలో అమెరికాలో నిర్వహించిన మహాసభలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన ఎమ్మెల్యే మాధవరెడ్డి తదనంతరం కెనడా దేశానికి వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరెడ్డికి కెనడాలో స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడారు. కెనడాలో ఉన్న తెలుగు ప్రజలు నిర్వహించిన అపూర్వ సమ్మేళనం తనకు ఎనలేని సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో ఎన్నారైల చొరవ మరువలేనిదని కొనియాడారు. ఫోరం సభ్యులందరూ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా రాణించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తద్వారా తెలంగాణతోపాటు నర్సంపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

● పీఏసీఎస్ చైర్మన్ మారం రాము

నెక్కొండ : ఏ పని అయినా అంకితభావంతో చేస్తేనే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని స్థానిక పీఏసీఎస్ చైర్మన్ మారం రాము తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల సమాఖ్య నుంచి విశిష్ట సేవా పురస్కారం అందుకున్న మండలంలోని తోపనపల్లికి చెందిన గడ్డం రమేశ్‌ను చైర్మన్ రాము ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో రమేశ్ ఎనలేని కృషి చేశాడని చెప్పారు. ప్రభుత్వాలు ఆశ్రమ పాఠశాలల్లో అందిస్తున్న విద్యావిధానంపై పేద విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో సఫలీకృతులయ్యారని తెలిపారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన సమాఖ్య జాతీయ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు ఈదునూరి యాకయ్య, మండల అధ్యక్షుడు తడుగుల జనార్దన్, నాయకులు దేవనబోయిన వీరభద్రయ్య, ముడుసు కొమ్మాలు, బిచ్చునాయక్ తదితరులు పాల్గొన్నారు.



రమేశ్‌ను సన్మానిస్తున్న చైర్మన్, తదితరులు

పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం నర్సంపేట మండల విద్యావనరుల కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయకుండా వదిలేసి ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో కొత్త పనులను నామమాత్రంగా చేపడుతోందని తెలిపారు. గతంలో ×మన ఊరు–మన బడి¥ కింద చేపట్టిన మరుగుదొడ్లు, మూత్రశాలల, తరగతి గదుల నిర్మాణాలు పూర్తి చేయడం లేదని విమర్శించారు. పలు పాఠశాలల్లో సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేక గతేడాది విద్యార్థులు నష్టపోయారని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను సత్వరమే పూర్తి చేయడంతోపాటు మెరుగైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు స్లాలిన సిద్ధు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అక్కకుంట నుంచి మట్టిని తరలించొద్దు

● తహసీల్దార్‌కు గ్రామస్తుల వినతి

రాయపర్తి (వర్ధన్నపేట) : మండలంలోని అంబేడ్కర్‌నగర్, వర్ధన్నపేట గ్రామాలకు అనుసంధానంగా ఉన్న అక్కకుంట నుంచి మట్టిని తరలించొద్దని కోరుతూ అంబేడ్కర్‌నగర్ గ్రామస్తులు తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం అంబేడ్కర్‌నగర్ వాసులు మాట్లాడారు. అక్కకుంటలో నీళ్లు ఎండిపోయిన సమయంలో పేద దళితులమైన తాము పంట పండించుకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. సుమారు వందేళ్లుగా కుంట భూమిని దున్నుకుంటూ తాము జీవిస్తుండగా కొందరు అక్రమార్కులు కుంట నుంచి ఇటుక బట్టీల కోసం మట్టిని తరలించడానికి యత్నిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. మట్టిని తరలించేందుకు యత్నిస్తున్న వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్‌నగర్ వాసులు దానయ్య, రాజు, జోసెఫ్, బాబు, రాజు, అనిల్, రమేశ్, ఆరోగ్యం, శివ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అంబేడ్కర్‌నగర్ వాసులు

మేధా స్కాలర్‌షిప్‌నకు విద్యార్థి ఎంపిక

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) గురుకుల విద్యాలయ 10వ తరగతి విద్యార్థి సర్వనేత్ర మేధా చారిటబుల్ ట్రస్టు స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దేవేందర్ తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో సర్వనేత్రను ప్రిన్సిపాల్ దేవేందర్, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ దేవేందర్ మాట్లాడారు. ఈ ఏడాది ఏప్రిల్ 11న ఆ ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన పరీక్షలో సర్వనేత్ర ప్రతిభ చాటి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి పోటీ పరీక్షలనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేలా ఉపాధ్యాయులు ప్రణాళికాయుతంగా బోధిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేశ్, సుకుమార్, ప్రభాకర్, సోమ రాణి, కిరణ్, కోటి, బషీర్, కృష్ణమూర్తి, సందీప్, లక్ష్మణ్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, టీచర్లు